అభివృద్ధి పథంలో నూజివీడు

- ఐదేళ్లలో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు
- అంతర్గత రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం
- జగనన్న కాలనీల్లో వసతుల కల్పన



నూజివీడులోని కోనేరు పేటలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



నూజివీడులోని 15వ వార్డులో నిర్మించిన తారురోడ్డు

నూజివీడు: రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న నూజివీడు పట్టణం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పథంలో పయనించింది. పట్టణ అభివృద్ధికి, ప్రజలకు సౌకర్యాల కల్పనకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిరంతరం కృషి చేశారు. పట్టణ జనాభా దాదాపు 70 వేల మంది కాగా పట్టణంలో 32 వార్డులు ఉన్నాయి. శివారు కాలనీలు కూడా ఎక్కువగా ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో ముందుకు సాగుతూనే ఉన్నారు. పట్టణంలోని ప్రతి అంతర్గత రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. డ్రెయిన్ల నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం చేపట్టి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రూ.10 కోట్లతో రోడ్ల నిర్మాణం

నూజివీడు మున్సిపాలిటీ పరిధిలో రూ.10 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్లు, తారురోడ్లను నిర్మించారు. ప్రతి వార్డులో సిమెంట్ రోడ్లు నిర్మించగా, ఏరియా ఆసుపత్రి నుంచి ట్రిపుల్ ఐటీ వరకు, విజయవాడ రోడ్డు వద్ద నుంచి వికాస్ టౌన్‌షిప్ వరకు తారు రోడ్డును నిర్మించారు. సుమారు రూ.80 లక్షల వ్యయంతో బైపాస్ రోడ్డులో తుక్కులూరు అడ్డరోడ్డు నుంచి విస్సన్నపేట అడ్డరోడ్డు వరకు వీధి లైట్లను ఏర్పాటు చేశారు. రామన్నగూడెం రోడ్డు లోను, జంక్షన్ రోడ్డులో తుక్కులూరు వరకు, మైలవరం రోడ్డులో పెట్రోలు బంకు నుంచి ట్రిపుల్ ఐటీ వరకు, కొన్నంగుంట రోడ్డులో సైతం పట్టణ శివారు వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.40 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. పట్టణ పరిధిలోని జగనన్న కాలనీల్లో సైతం వీధిలైట్ల సదుపాయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు బోర్లు వేసి డైరెక్ట్ పంపింగ్ స్కీంను ఏర్పాటు చేసి నీటి కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఎమ్మార్ అప్పారావు కాలనీ అభివృద్ధి

పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో సైతం రూ.2 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. దాదాపు కోటి రూపాయల వ్యయంతో పది అంతర్గత రహదారులకు సిమెంట్ రోడ్లు నిర్మించడంతో పాటు రూ.80 లక్షల వ్యయంతో మిగిలిన 30 రోడ్లను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. దీంతో కాలనీలోని రహదారులన్నీ అభివృద్ధి చెంది కాలనీ వాసులకు సౌకర్యంగా ఉంది. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలనీ అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. వీటన్నింటికీ తోడు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రూ.25 కోట్లతో జీ+3 నూతన భవన నిర్మాణం, కోటి రూపాయలతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు, ఎమ్మెల్యే ప్రతాప్ కృషితో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు, రూ.1.80 కోట్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాల నిర్మాణం, రూ.1.40 కోట్లతో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి పనులు వంటివి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టారు.

రాష్ట్రంలో ఫ్యాన్ గాలికి ఎదురేలేదు

నూజివీడు: రాష్ట్రంలో ఫ్యాన్ గాలికి ఎదురులేదని, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం తథ్యమని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డు ఎమ్మార్ అప్పారావు కాలనీలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **చాట్రాయి:** మండలంలోని నరసింహారావు పాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, ఉప సర్పంచ్ మందపాటి రఘుపతిరెడ్డి, విస్సంపల్లి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

ఆగిరిపల్లి: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు అన్నారు. గురువారం మండలంలోని చిన్నాగిరిపల్లిలో సర్పంచ్ పల్లగాని జమదగ్ని ఆధ్వర్యంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండవరదల రమేష్, సగ్గురు సర్పంచ్ ఎస్ఎస్ దిలీప్ కుమార్, జువ్వనబోయిన జమలయ్య, వాకా సక్కేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్నాగిరిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు

టీడీపీ ప్రచార వాహనం స్వాధీనం

అనుమతి లేకుండా స్క్రీన్‌పై వీడియోల ప్రదర్శన

నూజివీడు: వాహనానానికి మాత్రమే అనుమతి తీసుకొని దానికి ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావుపై దుష్ప్రచారం చేసే వీడియోలను ప్రదర్శిస్తున్న వాహనాన్ని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారుల బృందం గురువారం స్వాధీనం చేసుకుని సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. నూజివీడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావుపై బురద చల్లే వీడియోలను ప్రచార వాహనం ద్వారా ప్రదర్శిస్తున్నారు. దీనిపై గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వగడాల సత్యనారాయణ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై. భవానీశంకరికి ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు తెలపడంతో వారు స్క్రీన్‌తో ఉన్న వాహనాన్ని రాత్రి 8 గంటల సమయంలో అదుపులోకి తీసుకొని సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. ఈ లోగా అక్కడకు చేరుకున్న ఎంసీసీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనానికి ఉన్న అనుమతులన్నింటిని పరిశీలించారు. వీడియో ప్రదర్శనకు అవసరమైన జిల్లా స్థాయి అధికారుల కమిటీ ఇవ్వాల్సిన అనుమతులు ఏమీ లేకుండానే ప్రదర్శిస్తున్నట్లు తేలడంతో చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారికి నివేదిక అందజేశారు.

వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించండి

ఎమ్మెల్యే అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావు



మర్రిబంధంలో ప్రచారం చేస్తున్న అప్పారావు

నూజివీడు: ఐదేళ్ల పాలనలో ప్రజలకు మేలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ నూజివీడు అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని మీర్జాపురం, మర్రిబంధం, సీతారామపురంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి చూపించారన్నారు. అందుకే జనమంతా మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ఆయన వెంటే సాగుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. ఈ ఐదేళ్లు అందించిన సంక్షేమంతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలోని సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ దేశంలో ఏ రాష్ట్రంలో లేదని, ఈ వ్యవస్థతో ప్రభుత్వ పాలన ప్రజల గడప వద్దకు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ప్రజలు కూడా ఆలోచించి ఏ ప్రభుత్వం మేలు చేసిందో గుర్తించి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. చంద్రబాబు హయాంలో నీరు–చెట్టు పేరుతో చెరువుల్లోని మట్టిని, వాగులు, వంకలు, నదుల్లోని ఇసుకను దోచుకోవడం తప్ప ఏమన్నా ఉందా అని ప్రశ్నించారు. 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు తన హయాంలో అమలు చేసిన ఒక్క మంచి పథకం ఉందా అని నిలదీశారు. నేడు రోడ్లపై పడి తిరుగుతున్న చంద్రబాబు, ఉత్తపుత్రుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ కరోనా సమయంలో ముసుగులు వేసుకొని ఎక్కడ దాక్కున్నారని నిలదీశారు. ఎన్నికల సమయంలో మాత్రమే వీరికి ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలను ఇస్తూ చంద్రబాబు ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని, ప్రజలెవరూ ఆ హామీలను నమ్మవద్దని కోరారు. గతంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక రుణమాఫీని తుంగలో తొక్కాడని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోగి ప్రభాకర్, వడ్లాది త్రినాథ్‌రావు, కవులూరి యోగి పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..

నూజివీడు: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ నూజివీడు అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పల్లెర్లమూడి, ఎంఎస్‌పాలెంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. పోలిమెట్ల శివ, బోయపాటి మాధవి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రధాన అధికారి దేవరకొండ భూషణం గురువారం తెలిపారు. వివిధ ట్రేడుల్లో అడ్మిషన్ల కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తును ప్రింట్ తీసుకొని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను జూన్ 10వ తేదీలోగా ఏదైనా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు.

చెక్ పోస్టు వద్ద తనిఖీలు

చాట్రాయి: ఎన్నికల సందర్భంగా చెక్ పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య అన్నారు. గురువారం మండలంలోని కృష్ణారావుపాలెం రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మద్యం, నగదు తరలింపుపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు మేకా ప్రతాప్ ప్రచారం

చాట్రాయి: మండలంలోని బూరుగుగూడెం, పోతనపల్లి గ్రామాల్లో శుక్రవారం నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు బూరుగూడెం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందని, నాయకులు పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

తిరువూరు: ఓటుహక్కు వినియోగం ఆవశ్యకతను వివరిస్తూ తిరువూరులో వాకర్స్ క్లబ్ సభ్యులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బోస్ సెంటర్‌లో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మాధవి ర్యాలీని ప్రారంభించారు. బైపాస్‌రోడ్, అయ్యప్ప దేవాలయం, సుందరయ్య కాలనీ, మధిరరోడ్, పాత తిరువూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, రేగుచెట్టు సెంటర్, జైబావి సెంటర్, చీరాల సెంటర్, రాజుపేట మీదుగా ర్యాలీ సాగింది. ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని నినాదాలు చేస్తూ ప్రదర్శన జరిపారు. వాకర్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మైలవరం: నిరుపేద ఆర్యవైశ్యులకు మైలవరం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామాలయ ప్రాంగణంలో గురువారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు బయన శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి నిరుపేదలైన ఆర్యవైశ్యులు 20 కుటుంబాలకు సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కాజా మహేష్, సభ్యులు అనుమోలు పెద్ద అప్పారావు, రామకృష్ణ, కన్నయ్య, రాధాకృష్ణ, అనుమోలు గాంధీ, ఆర్యవైశ్య సంఘం పెద్దలు పాల్గొన్నారు.

తిరువూరులో నాణేల ప్రదర్శన

తిరువూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరులో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. 125 దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీని పలువురు విద్యార్థులు సేకరించి ఈ ప్రదర్శనలో ఉంచారు. భారతదేశంలో ఆంగ్లేయుల పాలనలో, అంతకు ముందు, తర్వాత ముద్రించిన నాణేల విశేషాలను జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు. గంగాధర్ వివరించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, హరికృష్ణ, పాపారావు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల్లో చందనోత్సవం

తిరువూరు: వైశాఖ మాసం సందర్భంగా తిరువూరులోని పలు దేవాలయాల్లో శుక్రవారం చందనోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు శ్రీరంగనాయక స్వామి దేవాలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం, సేవాకాలం అనంతరం చందనోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్త దారా రంగారావు చెప్పారు. తిరువూరు వేంకటాచలస్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు సేవాకాలం, చందనోత్సవం జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు తెలిపారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

- మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు
- ఇంటింటా ముమ్మర ప్రచారం
- బ్రహ్మరథం పడుతున్న ప్రజలు



కొండపల్లిలో ప్రచారం చేస్తున్న తిరుపతిరావు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి మరోసారి సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కోరారు. కొండపల్లిలో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి పలు వార్డుల్లో పర్యటించారు. పలువురు మహిళలు గుమ్మడి కాయలతో దిష్టితీసి హారతులు పట్టారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఈనెల 13న జరుగనున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి గెలిపిచాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మరో ఐదేళ్లు జగనన్న పథకాలు కొనసాగాలంటే మరలా సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఇప్పటికే కొండపల్లిలో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు, మరో రూ.198 కోట్లుతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయన్నారు. మరో రూ.63 కోట్లతో ఇంటింటికీ తాగునీటి పథకం టెండర్ దశలో ఉందని చెప్పారు. 3,120 మందికి జగనన్న కాలనీలో స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్లు దయా, గుంజా శ్రీనివాస్, నాగరాజకుమారి, పోరంకి పద్మావతి, శ్రీనివాసరాజు, చందా చంటి పాల్గొన్నారు.

విశ్వసనీయత వైపే ఓటర్లు..

జి.కొండూరు: టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించవని, నియోజకవర్గ ఓటర్లు విశ్వసనీయతవైపే నిలబడతారని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. జి.కొండూరులో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ ఈ ఎన్నికలతో వసంత వెంకట కృష్ణప్రసాద్ తట్టాబుట్టా సర్దుకొని నియోజకవర్గాన్ని వదిలి పారిపోవడం ఖాయమన్నారు. సామాన్యుడిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక రూ.వందల కోట్లు కుమ్మరించి గెలవాలని వసంత చేస్తున్న ప్రయత్నాలు ఆయన ఓటమి భయానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని విమర్శించారు. వసంత ఎన్ని కుట్రలు పన్నినా విజయం మాత్రం వైఎస్సార్ సీపీదేనని ధీమా వ్యక్తం చేశారు. తనని ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం



ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేస్తున్న శివశంకరరావు

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో వివిధ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. బూత్ కమిటీలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల పర్యవేక్షణలో గ్రూపులుగా ఏర్పడి ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్నారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, జూపూడి, మూలపాడు, కాచవరం, కొటికలపూడి గ్రామాల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా కేశినేని నాని, సర్నాల తిరుపతి రావును గెలిపించాలని కోరారు. కరపత్రాలు పంపిణీ చేసి డమ్మీ ఈవీఎంతో ఓటు వేసే విధానాన్ని వివరించారు. బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నిడుముక్కల శివశంకర్, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు నల్లమోతు సుభాష్, బొంత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి..

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌ను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి కుమార్తు సర్నాల మణికంఠ కోరారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. సర్పంచి గోపాలరావు, ఎంపీటీసీ అజ్మీర బసవమ్మ, నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం సర్నాల తిరుపతిరావు కుటుంబ సభ్యులు కుమారస్వామి పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ప్రచారం చేశారు.

- **విస్సన్నపేట:** వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు స్థానిక కోలేటి ఎస్సీ వాడ, రాజీవ్ కాలనీలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి మాట్లాడుతూ రెండు ఓట్లూ ఫ్యాను గుర్తుకు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రచారం చేశారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు



కృష్ణారావుపాలెం గిరిజన తండాలో ప్రచారం చేస్తున్న స్వామిదాసు

ఎ.కొండూరు: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. మండలంలోని కృష్ణారావు పాలెం, కేసియాతండా, గ్యామా తండా, డీప్లానగర్ తండాల్లో, మాధవరం గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. స్వామిదాసు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ భూక్యా గనియా, సర్పంచులు పర్వతనేని నాగమల్లేశ్వరి, జరబల జమలమ్మ, ఎంపీటీసీలు బి. వెంకటేష్ నాయక్, ఎం. అనూష, సర్పంచ్ కె. వెంకట సీతామహాలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షులు టి. వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అధికారం కోసమే విపక్షాల పొత్తులు..

కొణిజెర్ల(గంపలగూడెం): అధికారం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులు పెట్టుకున్నాయి తప్పా ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశ్య వారికి లేదని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. గురువారం ఆమె కొణిజెర్లలో వైఎస్సార్‌సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ల విజయాన్ని కాంక్షిస్తూ గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు బోల్లా కరుణకరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి వసంత యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన



ఇబ్రహీంపట్నం: మైలవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారు. మూలపాడులో ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో గురువారం రాజకీయ కార్యక్రమం ఏర్పాటు చేసి విమర్శల పాలయ్యారు. చర్చి ప్రాంగణంలో రాజకీయ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లు ఎమ్మెల్యేగా చేసిన వసంత చివరికి చర్చిలు, పాఠశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేయడంపై మేధావి వర్గం మండిపడుతోంది. ఎన్నికల నియమావళి తెలియని వ్యక్తులు చట్టసభలకు ఎలా వెళతారని ప్రశ్నిస్తున్నారు. ఇటీవలి కాలంలో తుమ్మలపాలెంలో ప్రచారం నిర్వహించే సమయంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో కార్యకర్తలకు అల్పాహారం ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. ఆ ఘటన మరువక ముందే మరో ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కేశినేని నాని, స్వామిదాసు ప్రచారం

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు శుక్రవారం గంపలగూడెం మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 6 గంటలకు గంపలగూడెం, 9 గంటల నుంచి లింగాల, 10 గంటల నుంచి గుళ్లపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొంటారని చెప్పారు.

టీడీపీ నాయకుడి రేషన్ దందా

98 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

రెడ్డిగూడెం: రెడ్డిగూడెంలో అక్రమంగా నిల్వ ఉంచిన 98 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధి కారులు గురువారం పట్టుకున్నారు. రెడ్డిగూడెంలోని ఒక గదిలో ఉంచిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్ల యీస్ అధికారి జి. మోహనరావు తనిఖీలు చేసి సీజ్ చేశారు. నిందితుడు బూరుగగూడెం గ్రామానికి చెంది న పసుపులేటి నాగరాజుపై కేసు నమోదు చేశామన్నారు.

నిందితుడు ఎంపీపీ ముఖ్య అనుచరుడు

అక్రమంగా రేషన్ బియ్యాన్ని డంప్ చేసిన పసుపులేటి నాగరాజు టీడీపీ చెందిన ఎంపీపీ ముఖ్య అనుచరుడు. ఎంపీపీ అండతో కొంతకాలంగా రేషన్ డీలర్ల సహకారంతో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నాడు. పలుసార్లు పట్టుబడినా నాగరాజులో ఏమాత్రం మార్పురాకుండా అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.